క్లుప్తంగా

రహదారి పనుల్లో నాణ్యత పాటించండి



కాళీపట్నం పాతపాడు రహదారి పనులను పరిశీలిస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

మొగల్తూరు: రహదారి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు సూచించారు. కాళీపట్నం పడమర నుంచి పాతపాడు వరకు రూ.12 కోట్లతో రహదారి నిర్మాణం, కాళీపట్నం కాలువపై వంతెన నిర్మాణ పనులను చేపట్టారు. కాళీపట్నం కాలువపై రెండు లైన్ల వంతెన నిర్మాణం పూర్తి కాగా అదే గ్రామం నుంచి పాతపాడు గ్రామం వరకు చేపట్టిన సీసీ రోడ్డు పనులు కొనసాగుతున్నాయి. సోమవారం కాళీపట్నం సొసైటీ చైర్మన్ దొంగ నాగముని, నాయకులు కవురు ఆదినారాయణ, కవురు సుబ్రహ్మణ్యం తదితరులు రహదారి పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. రహదారికిరువైపులా ఆక్రమణలు తొలగించి రహదారి విస్తరణ పనులు వేగవంతంగా పూర్తి చేయాలని కోరారు.

వలంటీర్ల సేవలు వెలకట్టలేనివి

పెనుమంట్ర: జగనన్న పాలనలో వలంటీర్లు అందిస్తున్న సేవలు వెలకట్టలేనివని ఆచంట నియోజకవర్గ వలంటీర్ల కన్వీనర్ కర్రి అనురాధ అన్నారు. సోమవారం గరువు గ్రామపంచాయతీ పరిధిలో వలంటీర్లకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. ప్రతి సంక్షేమ పథకాన్ని గ్రామస్తులకు చేరవేస్తున్న వలంటీర్ల సేవలు అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ముదునూరి నాగరాజు, గ్రామ కమిటీ అధ్యక్షుడు కొనకళ్ల భీమేశ్వరరావు, వలంటీర్లు పాల్గొన్నారు.

గుడాల గోపి పరామర్శ

పాలకొల్లు అర్బన్: మెడ ఎముక శస్త్ర చికిత్స చేయించుకుని రాజమండ్రిలోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పాలకొల్లు మండల జేసీఎస్ కన్వీనర్ పార్శి వెంకటరత్నాన్ని సోమవారం వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) పరామర్శించారు. త్వరలోనే సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకుని పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని ఆకాంక్షించారు.

తెలుగు వాకిలి యూట్యూబ్ ఆవిష్కరణ



తెలుగు వాకిలి యూట్యూబ్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

నరసాపురం రూరల్: వెయ్యేళ్ల తెలుగు సాహిత్యంలో తండ్రి కవితా వారసత్వాన్ని తీసుకున్న ఏకైక కవి కుటుంబంగా కడిమెళ్ల కుటుంబం మాత్రమే కనబడుతుందని సాహిత్య సేవలో వీరు చేస్తున్న సేవ అభినందనీయమని మాజీ ఉపరాష్ట్రపతి ఎం వెంకయ్యనాయుడు, పద్మవిభూషణ్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ అన్నారు. ఒంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా 30వ వార్షికోత్సవం సందర్భంగా ఇటీవల కాకినాడలో జరిగిన అఖిలభారత తెలుగు సాహితీ సదస్సులో భాగంగా గురుసహస్రావధాని కడిమెళ్ల వరప్రసాద్, రంగంపేటకు చెందిన కడిమెళ్ల శ్రీవిరించి పాల్గొని వారి కవితా గానంతో సాహితీ ప్రియులను మంత్రముగ్ధులను చేశారు. అనంతరం తెలుగు వాకిలి యూట్యూబ్‌ను వెంకయ్యనాయుడు, యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కవులను ఫౌండేషన్ అధ్యక్షుడు చిట్టెంరాజు ఘనంగా సత్కరించారు.

'తరల్'తో విద్యార్థుల అభ్యసనా సామర్థ్యం పెంపు

పాలకొల్లు సెంట్రల్: తరల్ (టీచింగ్ ఎట్ రైట్ లెవెల్) కార్యక్రమం ద్వారా వెనుకబడిన విద్యార్థుల అభ్యసనా సామర్థ్యం పెంపొందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని తరల్ జిల్లా కోఆర్డినేటర్ డి రాజేష్ అన్నారు. సోమవారం స్థానిక జీవీఎస్‌వీఆర్ఎం మునిసిపల్ ప్రాథమిక పాఠశాలలో తరల్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ రోజుకు రెండు గంటలు చొప్పున తప్పనిసరిగా తరల్ ప్రోగ్రాం ద్వారా విద్యార్థులకు బోధన నిర్వహించాలన్నారు. సంభాషణ, కథలు, చదవటం, చర్చ, ధ్వనితో ఆటలు, గుణింతాల చార్ట్, మైండ్ మ్యాప్, చిత్రాల క్యాలెండర్, రాయడం, ఆటలు మొదలైన వాటి ద్వారా విద్యార్థుల్లో ఆత్మస్థైర్యం పెంపొందించి చదువు పట్ల ఆసక్తి కలిగేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాయపూడి భవానీప్రసాద్, ఉపాధ్యాయులు సీహెచ్ శశికళ, విద్యార్థులు పాల్గొన్నారు.

శివదేవునిచిక్కాలలో కవాతు

పాలకొల్లు అర్బన్: రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో సోమవారం పోలీసులు తిల్లపూడి నుంచి శివదేవునిచిక్కాల మీదుగా బల్లిపాడు వరకు కవాతు నిర్వహించారు. పాలకొల్లు రూరల్ ఎస్సై డి హరికృష్ణ ఆధ్వర్యంలో కలకత్తాకు చెందిన ప్రత్యేక పోలీసులు ఈ కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా రూరల్ ఎస్సై డి హరికృష్ణ మాట్లాడుతూ ప్రజలు నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరగడానికి ప్రజలు, నాయకులు సహకరించాలని కోరారు.

అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పాలన

రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు



గొందిలో బీసీ కమ్యూనిటీ హాల్ భవనాన్ని ప్రారంభిస్తున్న రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు

నరసాపురం రూరల్: రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. సోమవారం నరసాపురం మండలంలోని గొంది గ్రామంలో రూ.15 లక్షలతో నిర్మించిన బీసీ కమ్యూనిటీ భవనాన్ని ఆయన ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ప్రసాదరాజు మాట్లాడుతూ ప్రభుత్వం సంక్షేమ కార్యక్రమాలకు, గ్రామాల్లో మౌలిక సదుపాయాల కోసం పెద్ద ఎత్తున నిధులు ఖర్చు చేస్తుందని తెలిపారు. గొంది గ్రామ ప్రజల కోరిక మేరకు రూ.15 లక్షల నిధులు కేటాయించి కమ్యూనిటీ భవనం నిర్మించినట్లు చెప్పారు. గ్రామస్తులు శుభకార్యాలు చేసుకునేందుకు, స్వయం సహాయక సంఘాలు సమావేశాలు జరుపుకునేందుకు ఈ భవనం ఉపయోగకరంగా ఉంటుందన్నారు. 412 గడప ఉన్న ఈ గ్రామంలో గడచిన ఐదేళ్ల కాలంలో రూ.8.50 కోట్లు సంక్షేమ కార్యక్రమాలకు, రూ.2.35 కోట్లు వివిధ అభివృద్ధి పనులకు ఖర్చు చేయడం జరిగిందన్నారు. నరసాపురం-పాలకొల్లు ప్రధాన రహదారిని చిట్టవరం నుంచి గొంది గ్రామానికి ఆర్అండ్‌బీ రోడ్డును నిర్మించడం జరిగిందన్నారు. వలంటీర్ వ్యవస్థ ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం అందిస్తున్న ఫలాలను, పింఛన్లు, రేషన్ బియ్యం వంటి పథకాలను ఇంటి వద్దకే తీసుకు వచ్చి ఇవ్వడం జరుగుతోందన్నారు. ఇంటింటికీ శుద్ధి చేసిన తాగునీటిని అందిస్తున్నామన్నారు. వేసవిలో కూడా తాగునీటి విషయంలో ఎటువంటి సమస్యలు తలెత్తకుండా ఉండేలా చర్యలు తీసుకున్నామని ప్రసాదరాజు వివరించారు. ఈ కార్యక్రమంలో దొంగ మురళీకృష్ణ, గ్రామ సర్పంచ్ మద్దాల శ్రీకృష్ణాంజనేయులు, కవురు ధర్మారావు, కవురు శ్రీనివాసులు, యర్రంశెట్టి శ్రీనివాసులు, అంగాడి ధర్మారావు, పెదపాటి శ్రీను, మోకా కృష్ణ, పెదపాటి రమేష్, యర్రంశెట్టి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం

మొగల్తూరు: పేరుపాలెం నార్త్ గ్రామంలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో వి బాబ్జిరాజు సోమవారం తెలిపారు. గ్రామంలోని సచివాలయ భవనంలో ఈ వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్నామని, మొగల్తూరు ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులతో పాటు మరో ముగ్గురు స్పెషలిస్టు వైద్యులు రోగులకు వైద్యసేవలందిస్తారన్నారు. గ్రామస్తులు ఈ వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ముగ్గురు జూదరుల అరెస్ట్

యలమంచిలి: ఏనుగువానిలంక గ్రామ పరిధిలో దళితవాడలోని కొబ్బరితోటలో పేకాడుతున్న ముగ్గురు వ్యక్తులను సోమవారం పట్టుకున్నట్లు హెడ్ కానిస్టేబుల్ సత్యనారాయణ తెలిపారు. వారి వద్ద నుంచి రూ.2040 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

కాటన్ పార్కు ప్రారంభోత్సవం



కాటన్‌పార్కును ప్రారంభిస్తున్న ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు

నరసాపురం: నియోజకవర్గంలో ప్రజలకు ఉపయోగపడే ప్రతి పనికి అధిక ప్రాధాన్యం ఇచ్చి ముందుకు వెళుతున్నామని ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. సోమవారం ఆయన పట్టణంలోని రైల్వేస్టేషన్‌రోడ్డులో రూ1.28 కోట్లతో సుందరంగా ఆధునీకరించిన కాటన్‌పార్కును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో శిథిలమై మూతపడ్డ కాటన్‌పార్కును అభివృద్ధి చేశామన్నారు. బస్టాండ్ రోడ్డు నుంచి కాలువదాటి నేరుగా పార్కులోకి రావడానికి వంతెన నిర్మించామన్నారు. పార్కు వద్దే లైబ్రరీ నిర్మాణం కూడా జరుగుతుందని చెప్పారు. పట్టణ వాసులకు ఆహ్లాదంగా గడపడానికి పార్కును అనువుగా తీర్చిదిద్దామన్నారు. రానున్న రోజుల్లో పార్కును మరింత సుందరంగా తీర్చిద్దిడానికి అవసరమైన ప్రణాళిక తయారు చేస్తున్నట్లు తెలిపారు. గత ఐదేళ్ల నుంచి నియోజకవర్గంలో దీర్ఘకాల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని వివరించారు. పట్టణంలో రూ.13 కోట్లతో 100 పడకల ఏరియా ఆసుపత్రి నిర్మాణం, బస్టాండ్ ఆధునీకరణ జరిగాయన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ, పార్టీ పార్లమెంట్ ఇన్‌చార్జి గూడూరి ఉమాబాల, మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు, అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ తిరుమాని నాగరాజు, అర్బన్ బ్యాంకు చైర్మన్ ద్వారా హేమకుమార్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

లంకభూములపై పూర్తి హక్కు



తూర్పుపాలెంలో పట్టాలు పంపిణీ చేస్తున్న మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు

పెనుగొండ: లంక భూములపై పూర్తి హక్కులు కల్పించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. సోమవారం సంపూర్ణ భూహక్కు చట్టంలో భాగంగా సిద్ధాంతం లంకభూముల పట్టాలను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. గతంలో సరైన ధ్రువీకరణ పత్రాలు లేకపోవడంతో రైతులు ఎంతో నష్టపోయేవారన్నారు. పూర్తి హక్కులతో పట్టాలు ఇవ్వడం వలన ప్రకృతి వైపరీత్యాలు వచ్చినపుడు ఆయా రైతులకు ఇన్సూరెన్సు లభిస్తుందన్నారు. రైతులు అందరూ సీఎం జగన్‌కు అండగా ఉండాలని కోరారు.

రామాలయాల నిర్మాణానికి రూ.30 లక్షల నిధులు

టీటీడీ దేవస్థానం శ్రీవాణీ ట్రస్ట్ ద్వారా బీసీ ప్రాంతాల్లో రామాలయ నిర్మాణాలకు రూ.30 లక్షల నిధులు మంజూరు చేసినట్లు మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు తెలిపారు. సోమవారం తూర్పుపాలెంలో గుమ్ములూరు, పీ పోలవరం, పండితవిల్లూరులకు చెందిన సంఘ నాయకులకు మంజూరు పత్రాలను అందించారు. ఈ సందర్భంగా వారు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ గుంటూరి పెద్దిరాజు, ఎంపీపీ సబ్బితి సుమంగళి, సీడ్స్ కార్పొరేషన్ డైరక్టరు పోతుమూడి రామచంద్రరావు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ ఇంటింటి ప్రచారం



సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న సర్పంచ్ మేరీ, నాయకులు

మొగల్తూరు: ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్నారు. సోమవారం మండలంలోని మోడి గ్రామంలో పార్టీ నాయకులు, గృహసారథులు, వలంటీర్లు కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి సంక్షేమ పథకాల ద్వారా ఎంత లబ్ధి పొందారో వివరించి కరపత్రాలు పంపిణీ చేశారు. అలాగే నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిని వివరించి రానున్న ఎన్నికల్లో తమకు మద్దతు పలకాలని కోరారు. కార్యక్రమంలో బండి ముత్యాలమ్మ ఆలయ కమిటీ చైర్మన్ కడలి మాణిక్యాలరావు, కడలి ఏసు, సాధనాల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ విజయానికి కష్టపడి పనిచేయాలి



కొమ్ముచిక్కాల దళిత యువజనులు గుడాల గోపి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరిన దృశ్యం

పాలకొల్లు అర్బన్: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయం సాధించడానికి కష్టపడి పని చేయాలని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల శ్రీహరిగోపాలరావు (గోపి) కోరారు. పోడూరు మండలం కొమ్ముచిక్కాల గ్రామానికి చెందిన పలువురు దళిత యువజనులు సోమవారం వైఎస్సార్ సీపీలో చేరారు. వారికి గుడాల గోపి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో కష్టపడి పనిచేసిన వారికి తగిన గుర్తింపు లభిస్తుందన్నారు. పార్టీలో చేరిన వారిలో కడిమి పుష్పరాజు, నార్కిమిల్ల రవికుమార్, తిగిరిపిల్లి నాగరాజు, ఖండవల్లి అన్వేష్, తానేటి ప్రవీణ్‌కుమార్, పోతమూడి బాబ్జి, బుడితి శ్రీను, మారంపూడి ఆదిత్య, మారంపూడి సుధాకర్, ఈతకోట నరసింహారావు తదితరులు ఉన్నారు.

పోడూరు మండల ఎస్సీ సెల్ కమిటీ ప్రకటన

వైఎస్సార్ సీపీ పోడూరు మండల ఎస్సీ సెల్ కమిటీని ఆ పార్టీ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) సోమవారం ప్రకటించారు. అధ్యక్షుడిగా తొండా శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా నేలపాటి రాజబాబు, వెందుర్తి చరణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శులుగా జల్లి చిట్టిబాబు, గంటి శివ, ఉండ్రాజవరపు యేసు, నేటపాటి చిట్టిబాబు, లంక చంటి, కార్యదర్శులుగా కంకిపాటి రవికుమార్, బుంగ అంజిత్‌కుమార్, పాలమూరి బాబ్జి, పెదపాటి శ్రీనివాస్, షోడగిరి చిన్నబాబు, సిర్రా జీవరత్నం, సంయుక్త కార్యదర్శులుగా విప్పర్తి అంబేద్కర్, కొండేటి శేఖర్, వేదంగి జగదీష్, తణుకుల రత్నరాజు, గోగులమండ ధనరాజు, యాళంగి శ్రీను, పాతకోసుల శంకర్, కుసుమే కిరణ్, దిడ్డా వెంకటేష్‌లను నియమించారు. వీరిని ఏఎంసీ వైస్‌చైర్మన్ పెన్మెత్స వెంకట సూర్యనారాయణరాజు (డీటీడీసీ బాబు) తదితరులు ప్రత్యేకంగా అభినందించారు.

విద్యార్థులకు పరీక్షల కిట్ల పంపిణీ

పెనుగొండ: పరీక్షలకు వెళ్లబోయే విద్యార్థులకు దాతలు పరీక్షల కిట్లు అందించడం అభినందనీయమని సిద్ధాంతంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయురాలు వి.మణికుమారి అన్నారు. సోమవారం పాఠశాలలో శరవణభవ రోడ్ లైన్స్ అధినేత మండవల్లి హరిప్రసాద్ పది, తొమ్మిది తరగతులకు చెందిన 300 మంది విద్యార్థులకు పరీక్షల కిట్లు పంపిణీ చేశారు.

నత్తారామేశ్వరంలో హుండీ ఆదాయం లెక్కింపు

పెనుమంట్ర: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని నత్తారామేశ్వరంలో వేంచేసియున్న శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయ హుండీలను సోమవారం లెక్కించారు. హుండీ ద్వారా రూ. 3.24 లక్షలు లభించగా, దర్శనం టికెట్ల ద్వారా రూ.2.01 లక్షలు, అభిషేకం టికెట్ల ద్వారా రూ. 1.20 లక్షలు, భక్తులు విరాళాల ద్వారా రూ.62 వేలు ఆదాయం లభించినట్లు ఆలయ ఈవో ఎన్ శ్రీదేవి తెలిపారు.

పోషకాహారంపై అవగాహన

పెనుగొండ: పౌష్టికాహారంతో ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం జరుగుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం.విజయకుమారి అన్నారు. పౌష్టికాహార పక్షోత్సవాల్లో భాగంగా సోమవారం పెనుగొండ శివారు జిలం చెరువులో గర్భిణులకు, బాలింతలకు, కిశోర బాలికలకు, చిన్నారులకు పౌష్టికాహారం వినియోగంపై అవగాహన కల్పించారు. కే తులసి, ఐ.దుర్గ, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

విద్యార్థులకు అయోడిన్ పరీక్షలు



ముత్యాలపల్లి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థినిని పరీక్షిస్తున్న డాక్టర్ దినేష్

మొగల్తూరు: ముత్యాలపల్లి గ్రామం గెదళ్ళవంపు ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు సోమవారం అయోడిన్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా మొగల్తూరు ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ ఒ దినేష్ మాట్లాడుతూ జాతీయ అయోడిన్ డిజార్డర్ అండ్ డెఫిసియన్సీ సేంపిల్ సర్వేలో భాగంగా విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. 6 నుంచి 12 ఏళ్ల వయస్సు గల 90 మంది విద్యార్థుల నుంచి, 18 మంది విద్యార్థులకు వారి ఇంటి వద్ద నుంచి సేంపిల్స్ సేకరించామన్నారు. పాఠశాల నుంచి ఉప్పుతో చేసిన వంటలు, విద్యార్థుల నుంచి యూరిన్ సేంపిల్స్ సేకరించి రాష్ట్ర ప్రధాన కార్యాలయానికి పంపుతామన్నారు. ప్రధాన కార్యాలయం నుంచి వచ్చిన నివేదిక ఆధారంగా ఎంత మంది విద్యార్థులు అయోడిన్ లోపంతో బాధపడుతున్నారో వారికి తగిన సూచనలు అందించి మందులు అందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది శ్రీను, మూర్తి, బంగారమ్మ, కృపారూత్, సుధ, తులసమ్మ, ఆరోగ్య కార్యకర్తలు మధు, శ్రీనివాసరావు, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పాలకొల్లు అర్బన్: ప్రతి ఒక్కరూ అయోడీన్ కలిగిన ఉప్పునే వాడాలని మెడికల్ ఆఫీసర్ డా. అద్దాల ప్రతాప్‌కుమార్ కోరారు. లంకలకోడేరు పీహెచ్‌సీ ఆవరణలో సోమవారం నేషనల్ అయోడైజ్డ్ డిసీస్ కంట్రోల్ ప్రోగ్రామ్‌లో భాగంగా 6 నుంచి 12 ఏళ్ల లోపు బాలబాలికలకు అయోడీన్ లోపం వలన వచ్చే వ్యాధులను గుర్తించడానికి ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహించారు. కొంతమంది పిల్లల యూరిన్ శాంపిల్స్‌ను సేకరించి పరీక్షలకు పంపించారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి గుడాల హరిబాబు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

జగనన్న రుణం తీర్చుకోవాలి



మేడపాడులో లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ ఇళ్ల పట్టాలు అందజేస్తున్న సర్పంచ్ గంటా శాంతకుమారి

యలమంచిలి: రాష్ట్రంలో ఉన్న ప్రతి పేదవాడి సొంతింటి కలను నెరవేర్చిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని మేడపాడు సర్పంచ్ గంటా శాంతకుమారి అన్నారు. మేడపాడు గ్రామంలో ఇళ్ల స్థలాలు వచ్చిన లబ్ధిదారులకు సోమవారం సచివాలయంలో రిజిస్ట్రేషన్ ఇళ్ల పట్టాలను ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇంత వరకు ఏ రాష్ట్రంలోను లేనివిధంగా 32 లక్షల మంది పేదలకు ఒకేసారి ఇళ్ల స్థలాలు ఇచ్చిన ఘనత జగనన్నది అని అన్నారు. అంతేకాకుండా చరిత్రలో ఇంతవరకు ఏ ప్రభుత్వమైన పేదలకు ఇళ్ల స్థలాలు ఇస్తే కేవలం పట్టాలు మాత్రమే ఇచ్చే వారన్నారు. పట్టా భూమి అంటే కేవలం వారు అనుభవించడానికి మాత్రమే ఇచ్చే పత్రం అన్నారు. పట్టా భూములపై బ్యాంకు అప్పులు కాని, స్థల క్రయ విక్రయాలు కానీ, కనీసం తనఖా పెట్టడానికి కానీ అవకాశం ఉండదన్నారు. కానీ ఇప్పుడు జగనన్న ఇంటి స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేసి లబ్ధిదారులకు దస్తావేజులు ఇవ్వడం వలన ఐదేళ్ల తరువాత ఆ స్థలానికి బ్యాంకు అప్పులు ఇవ్వడమే కాకుండా క్రయ విక్రయాలకు, వారసులకు బదలాయించడానికి అవకాశం ఉంటుందన్నారు. వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు గుర్రాల వెంకట్రావు మాట్లాడుతూ గత ఐదేళ్లుగా జగనన్న ప్రజల సంక్షేమం కోసం ఎన్నోసార్లు బటన్ నొక్కి మహిళల ఖాతాలో డబ్బులు జమచేశారన్నారు. ఈ ప్రభుత్వంలో మీకందరికీ మేలు జరిగిందని భావిస్తే వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై రెండు సార్లు బటన్ నొక్కి జగనన్న రుణం తీర్చుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ డేగల సూర్యప్రభ, ఉపసర్పంచ్ ముద్దల శ్రీనివాస్ వైఎస్సార్ సీపీ నాయకులు గంధం సత్యకీర్తి, అడబాల రామ్మోహనరావు, డేగల వెంకటేశ్వరరావు వార్డు సభ్యులు గాది వరదయ్య, బాలం రామ్మోహనరావు, కుక్కల సూరయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రకటన

మహారాజశ్రీ పాలకొల్లు అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఓ.యస్.నెం.261/2022

బిట్వీన్
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, పాలకొల్లు బ్రాంచి, రి॥బై॥ ఇట్స్ బ్రాంచి మేనేజరు ... వాది

మరియు


పిన్ని యేసు పాపారావు తండ్రి మోహనరావు డోర్.నెం. 34-41-43 చింతపల్లి వారి వీధి, పాలకొల్లు ... ప్రతివాది

పై నెంబరు దావాలో శ్రీ కోర్టు వారు మీకు ఎన్ని పర్యాయములు సమన్లు జారీ చేసినప్పటికి, మీరు ఉద్దేశపూర్వకంగా అందుకొనక కాలయాపన చేయుచున్నందున. శ్రీ కోర్టు వారు ఈ పేపరు ద్వారా మీకు సమన్లు జారీ చేసియున్నారు. సదరు దావా ది.23.04.2024 తేదీన వాయిదా అయివున్నది. కావున మీరు ప్రత్యక్షముగా గాని, లేదా మీ పరోక్షమున ప్లీడరు గారి ద్వారా గాని కోర్టులో హాజరు అయ్యి మీ వాదన దాఖలు చేసుకొనవలెను. లేని యెడల శ్రీ కోర్టు వారు మీ పరోక్షమున ముందు గ్రంధము జరిపెదరని యిందుమూలముగా తెలియచేయడమైనది.

పాలకొల్లు
11.03.2024

పి.డి.యస్.వి. బాలాజీ
బి.కామ్., బి.యల్
న్యాయవాది - పాలకొల్లు
సెల్ : 94904 33732

ప్రకృతి వ్యవసాయంలో నవ ధాన్యాల సాగు



నవ ధాన్యాల సాగుపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ప్రకృతి వ్యవసాయ రైతులు

యలమంచిలి: ప్రకృతి వ్యవసాయంలో నవ ధాన్యాల సాగుదే ప్రధాన పాత్ర అని ప్రకృతి వ్యవసాయం గుంపర్రు యూనిట్ ఇన్‌చార్జి జ్యోతి చెప్పారు. నవ ధాన్యాల సాగు ప్రాధాన్యత వివరిస్తూ సోమవారం గుంపర్రు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దాళ్వా పంట కోతకు ముందు పంటకు చివరి తడి ఇచ్చే సమయంలో రైతులంతా 18 నుంచి 30 రకాల (నవ ధాన్యాలు) విత్తనాలను పొలంలో చల్లాలన్నారు. దీని వలన భూమిలో కార్బనం పెరుగుతుందన్నారు. తద్వారా పంట దిగుబడులు పెరగడమే కాకుండా వేసవిలో పశువులకు పశుగ్రాసం కొరత తీరుతుందన్నారు. ప్రస్తుత కాలంలో రసాయనికి ఎరువుల వినియోగం బాగా పెరిగిన నేపథ్యంలో భూసారం పెరగడానికి నవ ధాన్యాల సాగు ప్రధానం అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆనిశెట్టి మల్లిక, ప్రకృతి వ్యవసాయ డివిజన్ ఇన్‌చార్జి పి అప్పారావు పంచాయతీ కార్యదర్శి మన్నే మాధురి, ఐసీఆర్‌పీలు జడ్డు లక్ష్మీనారాయణ, బండి లక్ష్మీదుర్గ, కె సోని, రత్నకుమారి ప్రకృతి వ్యవసాయ రైతులు గణపాబత్తుల ఏసుబాబు, అనిశెట్టి ధర్మారావు, శీలం కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం పట్ల దృష్టి పెట్టాలి

మొగల్తూరు: రైతులు ప్రకృతి వ్యవసాయం పట్ల దృష్టి సారించాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. సోమవారం మొగల్తూరులో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి అంగన్‌వాడీ కేంద్రం ఆవరణలో కూరగాయలను పండించి వాటిని చిన్నారులకు వండి పెట్టడం కారణంగా పుష్టిగా ఉంటారన్నారు. రైతులు కూడా తమ చేలల్లోని ఖాళీ స్థలాల్లో మొక్కలు పెంచి వ్యవసాయ పద్ధతులు పాటించి పంటల ఖర్చు తగ్గించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కె.లక్ష్మీకుమారి, టి.పుష్ప, పి రామలక్ష్మి, యు.రామలక్ష్మి, జి.కనకదుర్గ, భవాని తదితరులు పాల్గొన్నారు.

శెట్టిబలిజ 'యువభేరి'ని విజయవంతం చేయాలి



నూతన కార్యవర్గంతో జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు తదితరులు

పాలకొల్లు సెంట్రల్: శెట్టిబలిజ సంఘీయులు అందరూ ఒకమాటపై ఉండి రాబోయే ఎన్నికల్లో ఎక్కడ శెట్టిబలిజ సభ్యులు పోటీ చేస్తే వారికి ఆర్థికంగా, రాజకీయంగా అండగా నిలబడాలని ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు కుక్కల శ్రీనివాసు పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక త్యాగరాజ భవనంలో జరిగిన నియోజకవర్గ సర్వసభ్య సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ నెల 24వ తేదీన పాలకొల్లు నియోజకవర్గం సగం చెరువు గ్రామంలో శెట్టిబలిజ యువసేన ఆధ్వర్యంలో నిర్వహించనున్న యువభేరి సభను విజయవంతం చేయడానికి ప్రతి శెట్టిబలిజ సోదరుడు కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా నియోజకవర్గం నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేసినట్లు తెలిపారు. పాలకొల్లు నియోజకవర్గ కన్వీనర్ పెచ్చెట్టి వెంకటేశ్వరరావు, పాలకొల్లు అధ్యక్షుడిగా గుత్తుల శ్రీనివాసరావు, యలమంచిలి అధ్యక్షుడిగా మల్లుల సంజీవ్, పోడూరు మండల అధ్యక్షుడిగా బండి బాలకృష్ణలను నూతనంగా ఎంపిక చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమానికి జిల్లా ప్రధాన కార్యదర్శి పి.సింహాచలం, బీసీ చైతన్య వేదిక అధ్యక్షుడు వీరవల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

శివదేవస్వామికి శ్రీపుష్పోత్సవం

పాలకొల్లు అర్బన్: వాయుత్రిలింగ క్షేత్రంగా ప్రసిద్ధి చెందిన శివదేవునిచిక్కాలలో శ్రీ పార్వతీ సమేత శ్రీ శివదేవస్వామికి సోమవారం రాత్రి శ్రీపుష్పోత్సవం నిర్వహించారు. ఈవో నామాల రంగరాజన్, భక్తులు పాల్గొన్నారు.